సాక్షి
మెదక్
సోమవారం। 1 । ఏప్రిల్ । 2024



కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎవరైన ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే లైవ్ ఫొటోలు, వీడియోలు తీసి సీ- విజిల్ ద్వారా పంపాలని సూచించారు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు సీ-విజిల్ యాప్‌ను తమ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని తమ చుట్టు పక్కల జరుగుతున్న కోడ్ ఉల్లంఘనలను అప్‌లోడ్ చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కలెక్టరేట్‌లో 24 గంటలు సీ- విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు.


భక్తుల ప్రత్యేక ప్రార్థన


శిలువ వద్ద క్యాండిల్స్ వెలిగిస్తున్న మహిళలు

● సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఏసు పునరుత్థాన దినోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 4.30కు శిలువను చర్చి చుట్టూ ఊరేగించి క్యాండిల్స్ వెలిగించారు. భక్తులు భారీగా తరలిరావడంతో చర్చి ప్రాంగణంలో కోలాహలం నెలకొంది. చర్చి ప్రెసిబెటరి ఇంచార్జి శాంతయ్య భక్తులను ఉద్దేశించి దైవ సందేశం ఇచ్చారు.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు

మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టరేట్‌కు వచ్చి ఇబ్బంది పడొద్దని సూచించారు.

7న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

నర్సాపూర్: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్‌లో చేరేందుకు ఈనెల 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ రీజనల్ కోఆర్డినేటర్ సంపత్ కుమార్ తెలిపారు. పరీక్ష మెదక్ అజంపురలోని గిరిజన బాలికల గురుకులంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం కోసం ఎంట్రెన్స్ టెస్ట్ అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు ఉంటుందని చెప్పారు. కాగా హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

నవోదయ పరీక్ష ఫలితాలు వెల్లడి


వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): నవోదయ విద్యాలయాల్లో ఆరోతరగతి అడ్మిషన్ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయని వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. అర్హతపొందిన అభ్యర్థులకు సమాచారం చేరవేశామని, హాల్‌టికెట్ నంబర్, డేట్‌ఆఫ్‌బర్త్ వివరాలు నమోదుచేసి ఫలితాలను నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అర్హత పొందిన అభ్యర్థులకు ఫోన్ ద్వారా, పోస్టుద్వారా సమాచారం చేరవేస్తున్నామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జేఎన్‌వీమెదక్.కామ్ వెబ్‌సెట్ నుంచి ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిచేసి విద్యాలయానికి సబ్మిట్ చేయాలన్నారు. ఏప్రిల్ 8 నుంచి 13 వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. ఇందుకు సంబంధించి సమాచారం కోసం జేఎన్‌వీఎస్‌టీ ఇంఛార్జి: 94409 26144, నవోదయ ప్రిన్సిపాల్ : 99215 55310 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సమాజానికి సాహిత్యం అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి సమాజానికి సాహిత్యం ఎంతో అవసరమని ప్రముఖ సంస్కృత పద్యకవి దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని హరిహర రెసిడెన్సీలో లలితా చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా అశు కవితా పద్యధార కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాహిత్యంపై ప్రతి ఒక్కరూ మక్కువ చూపాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రాధాకృష్ణ, ప్రముఖ కవులు కంది శంకరయ్య, రాజేశం, లక్ష్మయ్య, లింగేశ్వర శర్మ, శివకుమార్, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురూ ముగ్గురే!

కాంగ్రెస్, బీజేపీ నుంచి ఎన్నికల బరిలో పాత కాపులే

- బీఆర్ఎస్ టికెట్ స్థానికేతరుడికి కట్టబెట్టారనే ప్రచారం
- అభ్యర్థుల విషయంలో ఓటర్లలో కనిపించని ఉత్సాహం

జహీరాబాద్: జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి జరుగనున్న ఎన్నికల్లో జాతీయ పార్టీల నుంచి మరోమారు పాత వారే బరిలో ఉండడంతో ఆయా పార్టీల లీడర్, క్యాడర్‌లో జోష్ లేకుండా పోయింది. ఒకరు సిట్టింగ్ ఎంపీ కాగా, మరొకరు మాజీ ఎంపీ. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి కొత్త అభ్యర్థులు రంగంలో ఉండే అవకాశముందని రాజకీయ పండితులు, ప్రజలు భావించినా వారి అంచనాలు తలకిందులయ్యాయి.



మూడోసారి పోటీలో శెట్కార్

కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సురేష్ శెట్కార్‌కు మూడోసారి అవకాశం కల్పించింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున సురేష్ శెట్కార్ పోటీ చేసి గెలుపొందారు. అప్పటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన యూసూఫ్‌అలీపై 19,407 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లోనూ మరోమారు టికెట్ కేటాయించింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున మొదటి సారి ఎన్నికల బరిలో దిగిన కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గానికి చెందిన బీబీ పాటిల్ చేతిలో ఓటమి పాలయ్యారు. శెట్కార్‌పై బీబీ పాటిల్‌కు 1,44,631 ఓట్ల మెజార్టీ లభించింది. 2019 ఎన్నికల్లో సురేష్‌శెట్కార్ టికెట్ ఆశించినా అధిష్టానం నిరాకరించింది. ఎల్లారెడ్డికి చెందిన మదన్ మోహన్‌రావుకు టికెట్ కేటాయించగా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. శెట్కార్ ఎంపీగా ఉన్నప్పుడు ప్రజలకు దూరంగా ఉన్నారనే విమర్శలు ఎదుర్కొన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి పెద్దగా చేసిందేమీ లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాజాగా టికెట్‌ను దక్కించుకోవడంతో ప్రజల్లోకి వెళ్లి ఎలాంటి హామీలు ఇస్తారనే దానిపై పార్టీ శ్రేణులు, ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.


సురేష్ శెట్కార్, కాంగ్రెస్ అభ్యర్థి

పాటిల్ రెండు సార్లు గెలిచినా క్యాడర్‌కు దూరం

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి రెండు పర్యాయాలు బీబీ పాటిల్ గెలుపొందినా క్యాడర్‌కు పూర్తిగా దూరంగా ఉన్నారనే విమర్శలున్నాయి. ఇక ప్రజలతో అయితే సత్సంబంధాలు నెరపలేదనే ఆరోపణలున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో ఎంపీ క్యాంపు కార్యాలయం సైతం ఏర్పాటు చేయలేదు. ఏదైనా పని కోసం హైదరాబాద్ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితిలో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన మరుసటి రోజే జహీరాబాద్ ఎంపీ టికెట్‌ను దక్కించుకున్నారు. బీజేపీ శ్రేణులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కొత్త వ్యక్తికి టికెట్ వస్తుందని భావించారు. దీంతో బీజేపీ అధిష్టానం మాత్రం పార్టీ మారిన వ్యక్తికే టికెట్ ఖరారు చేయడం క్యాడర్‌ను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇప్పుడిడప్పుడే పార్టీ శ్రేణులను దారికి తెచ్చుకునే పనిలో బీబీ పాటిల్ పడ్డారు. 2014 ఎన్నికల్లో లక్షకు పైగా మెజార్టీతో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థిపై బీబీ పాటిల్ గెలుపొందారు. 2019లో మాత్రం మదన్‌మోహన్‌పై సుమారు 6 వేల పైచిలుకు ఓట్లతో గట్టెక్కారు.


బీబీ పాటిల్, బీజేపీ అభ్యర్థి

బీఆర్ఎస్ నుంచి స్థానికేతరుడికి అవకాశం

బీఆర్ఎస్ తరపున జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్ పేరును ప్రకటించారు. పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో పార్టీ క్యాడర్‌కు పరిచయం లేకుండా పోయింది. పార్టీ తరపున పోటీ చేసేందుకు అభ్యర్థి ఎవరూ దొరకనందునే బయటి వ్యక్తికి టికెట్ కేటాయించారని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. గాలి అనిల్ కుమార్ జహీరాబాద్ ప్రాంత వాసి అని, మొగుడంపల్లి మండలంలోని మాడ్గిలో ఓటు హక్కు ఉందని, వ్యవసాయ భూములు, ఇల్లు ఉందని బీఆర్ఎస్ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలోనే బీఆర్ఎస్ గెలుపొందింది. పార్లమెంట్ పరిధిలోకి వచ్చే నారాయణఖేడ్, అందోల్ అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ వశం అయ్యాయి. జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపొందినా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పార్టీ శ్రేణులు ఢీలా పడ్డాయి. ఒక్కొక్కరుగా పార్టీని వీడి వెళ్తుండడం నేతలను ఆందోళనకు గురి చేస్తోంది.


గాలి అనిల్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి

వరికోతలు షురూ..

వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 20 శాతం మేర పూర్తి కాగా.. కోసిన ధాన్యాన్ని రైతులు రోడ్ల పక్కన ఆరబెడుతున్నారు. అయితే ఇప్పటికి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అకాలవర్షాలు కురిస్తే ధాన్యం తడిసే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. -మెదక్‌జోన్

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- జిల్లావ్యాపంగా 2.61 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో 2.61 లక్షల ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. ఇందుకు గాను 3.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేశారు. అయితే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే మెదక్, హవేళిఘనాపూర్, పాపన్నపేట, చిన్నశంకరంపేట, రామాయంపేట తదితర మండలాల్లో వరి కోతలు ప్రారంభం అయ్యాయి. కోసిన ధాన్యాన్ని రోడ్ల వెంట, కల్లాల్లో ఆరబెడుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట తదితర మండలాల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు.

399 కొనుగోలు కేంద్రాలు

జిల్లావ్యాప్తంగా 399 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇందులో 200 పీఏసీఎస్ ఆధ్వర్యంలో.. మరో 199 కేంద్రాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


మెదక్ పట్టణం గాంధీనగర్‌లో రోడ్డు పక్కన ధాన్యం ఆరబెడుతున్న రైతు

నేటి నుంచి కొనుగోళ్లు

మెదక్, పాపన్నపేట మండలాల్లో నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ ఏడాది 2.61 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. – హరికృష్ణ, డీఎం, సివిల్ సప్లై

చుక్క నీరు లేక.. దిక్కు తోచక


ట్యాంకర్ ద్వారా పంటకు నీరు పెడుతున్న రైతు

చిన్నశంకరంపేట(మెదక్): వరి పంటను కాపాడుకునేందుకు ఓ రైతు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. ట్యాంకర్లతో నీటిని తరలించి పంటకు పెడుతున్నాడు. నార్సింగి మండల కేంద్రానికి చెందిన కామారం చిన్న సిద్దిరాములు నర్సంపల్లి శివారులో మూడెకరాల్లో వరి సాగు చేశాడు. రెండు బోర్లు పుష్కలంగా నీరుపోస్తున్నాయని వరి సాగుచేయగా పంట ఏపుగా పెరిగింది. మరో రెండు తడులు పారితే పంట చేతికొస్తుందనుకున్న సమయంలో రెండు బోర్లలో నీరు తగ్గిపోయింది. పచ్చని పంట కళ్ల ముందే ఎండిపోవడం చూసి తట్టుకోలేకపోయాడు. వెనుకంజ వేయకుండా రోజుకు 10 నుంచి 15 ట్యాంకర్ల నీటిని తీసుకొచ్చి పొలానికి పెడుతున్నాడు. ఒక ట్యాంకర్‌కు కనీసం రూ. వెయ్యి ఖర్చు చేస్తున్నాడు. పంటను కాపాడుకునేందుకు మరో రూ. లక్ష భరించేందుకు సిద్ధం అయ్యాడు. గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావుల్లో చుక్క నీరు రాకపోవడంతో వంద ఎకరాలకు పైగా పంటలు ఎండిపోయి పశువులకు మేతగా పెడుతున్నారు.

వన దుర్గమ్మా.. చల్లంగా చూడమ్మ


అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి
క్యూలైన్‌లో భక్తులు

పాపన్నపేట(మెదక్): మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ఆదివారం వేలాది భక్తులు ఏడుపాయల తరలివచ్చారు. మంజీర నదిలో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారి పార్థివశర్మ అమ్మవారికి కుంకుమ అర్చన చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. టెంట్ల కింద భక్తులు సేద దీరి విందు చేసుకొని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు.

భలే టేస్టీ

- నోరూరిస్తున్న హలీం, హరీస్
- హైదరాబాద్ వంట వాళ్లతో తయారీ
- రంజాన్ వేళ ఘుమఘుమలు.. అత్తరు గుబాళింపులు
- ప్రత్యేక పదార్థాల విక్రయాలతో కిటకిటలాడుతున్న హోటళ్లు





సాక్షి, సిద్దిపేట: రంజాన్ అనగానే భోజన ప్రియులకు వెంటనే గుర్తొచ్చేది హలీం, హరీస్. ఇది కేవలం రంజాన్ మాసంలోనే లభించే ప్రత్యేక వంటకం. రుచిలో రారాజుగా వెలుగొందే ఈ బల వర్ధకమైన ఆహారం మొదట్లో అరబ్ దేశాల నుంచి ఇక్కడకు దిగుమతి అయ్యేది. ఇప్పుడు మన ప్రాంతాల్లోనే తయారు చేస్తున్నారు. మటన్, చికెన్ హలీంల బట్టీలే దర్శమిస్తున్నాయి. పొట్టేలు, కోడి మాంసంతో పాటు గోధుమలు, ఇతర సుగంధద్రవ్యాలతో తయారు చేస్తున్నారు. రోజంతా ఏమీ తినకుండా కఠోర దీక్షతో ఉపవాసం ఉండే వారికి హలీం తినడం వల్ల శరీరంలో సత్తువ పెరిగి ఉత్సాహంగా ఉంటారు. అందుకే రంజాన్ మాసంలో ఈ వంటకానికి డిమాండ్ ఎక్కువ. మటన్‌తో హలీం, చికెన్‌తో హరీస్‌ను వేడి వేడిగా తయారు చేసి అందజేస్తున్నారు. ప్లేట్ చికెన్ హరీస్ రూ.100, మటన్ హలీం రూ.180లకు ప్లేట్ అందజేస్తున్నారు.

కొన్ని వస్తువులు ప్రత్యేకం



ముస్లింలు రంజాన్ మాసంలో కొన్ని వస్తువులు ధరిస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథం సహా తలపై ధరించే టోపీ వరకు రోజా పాటించే వారితో పాటు అందరూ ఈ వస్తువులను వినియోగిస్తారు. అయితే ఈ వస్తువులన్నీ కూడా అన్ని షాపుల్లో లభ్యం కావు. మసీదు సమీపంలోని పలు షాప్‌లలో మాత్రమే లభిస్తాయి.

తజ్బీ ద్వారా అల్లాను ధ్యానం చేస్తారు. ప్రార్థనకు వెళ్లే సమయంలో కళ్లకు సుర్మా పెట్టుకుని వెళ్తారు.

పేదల పాలిట వరం జకాత్

రంజాన్ మాసంలో దానధర్మాలకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. దీనిని జకాత్ అంటారు. సంపదలో కొంత భాగాన్ని దానం చేయాలని ఇస్లాం నియమాలు చెబుతున్నాయి. ప్రతి ఒక్కరి సంపదలో పేదవారికి భాగం ఉంటుందని భావిస్తారు. ఈ మాసంలో దానం చేస్తే ఎంతో పుణ్యం వస్తుందన్న భావనతో ముస్లింలు దానం చేస్తుంటారు.

ఖర్జూర



ఎడారుల్లో తాగేందుకు నీరు పెద్దగా లభించదు. దీంతో అమృతం వంటి ఫలాలను అందించాలని ప్రార్థించగా, అల్లా ఇచ్చిన ఫలాలే ఖర్జూరా పండు అని ముస్లింలు విశ్వసిస్తారు. అంతటి ప్రత్యేకత ఉన్నందుకే ఇఫ్తార్ సమయంలో ఖర్జూరతోనే ఉపవాసం విరమించేందుకు ఇష్ట పడతారు. ఈ మేరకు పట్టణంలో వ్యాపారులు ఈ నెలలో సాధారణంగా లభించే వాటితో పదుల సంఖ్యలో ఖర్జూర పండ్లను విదేశాల నుంచి తెప్పించి అందుబాటులో ఉంచుతున్నారు. కీమ్యా డేట్స్, సన్‌ఫ్రూట్ ఇలా రకరకాలు విక్రయిస్తున్నారు. కిలో రూ.200 నుంచి రూ.2000 వరకు విక్రయిస్తున్నారు.

డబుల్ కా మీఠా..



బ్రెడ్, డాల్డా, నూనె, పాలు, నెయ్యి, చక్కెర, కస్టడ్ క్రీమ్, కోవ, బాదం, కిస్మిస్‌లతో తయారు చేసిన ఫ్రెష్ డబుల్ కా మీఠాను రంజాన్ ఉపవాసాల సందర్భంగా విక్రయిస్తున్నారు. డబుల్ కా మీఠా ప్లేట్ రూ.50 నుంచి రూ.60 తీసుకుంటున్నారు. పార్శిల్ కోసం ప్రత్యేకంగా బాక్స్‌లలో పెట్టి అందజేస్తున్నారు.

పండ్లకు గిరాకీ..



రంజాన్ మాసం వచ్చిందంటే చాలు పండ్లకు భలే గిరాకీ ఉంటుంది. వివిధ రకాల పండ్లను ఇఫ్తార్ సమయంలో తింటారు. ద్రాక్ష, పైనాపిల్, అరటి పండు, ఆపిల్, నారింజ, బొప్పాయి, పుచ్చకాయ, దానిమ్మ వంటి పండ్లను ఎక్కువగా స్వీకరిస్తారు.

ఇఫ్తార్.. పార్టీ



ముస్లింలు ఉపవాసాలు ఉండేందుకు ఎంతటి ఆసక్తిని కనబరుస్తారో ఇఫ్తార్ ఇచ్చేందుకు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తారు. ఉపవాసం ఉన్న వారి చేత ఇఫ్తార్ చేయిస్తారో వారికి కూడా ఉప వాసం ఉన్నంత పుణ్యం లభిస్తుంది. అందుకే ఎక్కువమంది దీక్షా ధారులకు సాయంత్రంవేళ ఇఫ్తార్లు ఇచ్చి అల్లా కృప పొందుతారు.

తయారు చేస్తున్నా..



హలీం, హరీస్‌ను తయారు చేసేందుకు 15 ఏళ్లుగా హైదరాబాద్ నుంచి సిద్దిపేటకు వస్తున్నా. రంజాన్ నెల మొత్తం ఇక్కడే ఉంటున్నాం. నాతోపాటు ఎనిమిది మంది వచ్చి రుచికరమైన వంటకాలు తయారు చేసి అందిస్తున్నాం. సాధారణ సమయాల్లో పెళ్లిళ్లకు సైతం వంటలు చేస్తుంటాను. –ఎస్‌డీ జాఫర్, వంట కార్మికుడు

కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపు

నిజాంపేట(మెదక్): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కరువును తెచ్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాలువల ద్వారా నీరు అందించకుండా, 24 గంటల విద్యుత్ సరఫరా చేయకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు. వంద రోజుల్లో ఆరు హామీలు నెరవేర్చుతామని హామీ ఇచ్చి మరిచారని మండిపడ్డారు. మోదీ అయోధ్యలో రామమందిరం నిర్మించి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఎన్నో ఆలయాలు నిర్మించినా గొప్పలు చెప్పుకోలేదన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేద, బడుగు బలహీన విద్యార్థులకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు.


నిజాంపేట: మాట్లాడుతున్న హరీశ్‌రావు

గెలిపిస్తే.. ప్రజల కష్టాలు తీరుస్తా

రామాయంపేట(మెదక్): తనను ఎంపీగా గెలిపిస్తే ప్రజల కష్టాలు తీరుస్తానని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం రామాయంపేటలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహాక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేదల కోసం ఫంక్షన్‌హాళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. తాను కలెక్టర్‌గా ఉన్నప్పుడు పేద ప్రజల కోసమే పనిచేశానని, ఎంతో మంది నిరుపేదలను ఆదుకున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలతో ప్రజలను మోసగించి అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏ ఒక్కరిపై కేసులు పెట్టలేదని, ఎవరని ఇబ్బందుల పాలు చేయలేదన్నారు. కాంగ్రెస్ గెలిచిన అనతికాలంలోనే ప్రతిపక్షాలపై కేసులు బనాయించి వేధింపులకు పాల్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సరాపు యాదగిరి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు నాగరాజు, తదితరులు మాట్లాడారు.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడు తల్లి చెంతకు


తప్పిపోయిన బాలునితో టీచర్‌

గజ్వేల్‌: తప్పిపోయి వచ్చిన బాలుడిని ఆదరించిన ఆపై సురక్షితంగా తల్లికి అప్పగించింది ఓ ఉపాధ్యాయులు. ఈ విషయమై సోషల్‌ మీడియాలో ఆమెకు అభినందనలు వెల్లువెత్తాయి. పట్టణంలో రెండ్రోజుల క్రితం సంగాపూర్‌ రోడ్డు సంచార జాతులకు చెందిన ఓ బాలుడు తప్పిపోయాడు. తల్లి కనిపించక పోయే సరికి ఏడవటం మొదలెట్టాడు. రహదారి వెంట ఎంతోమంది చూస్తూ వెళ్లారే తప్ప ఎవరూ పట్టించుకోలేదు. ఇదే ప్రాంతంలో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సౌజన్య.. బాబును ఆదరించింది. ఎండ తీవ్రత కారణంగా అపరిశుభ్రంగా మారిన చిన్నారిని ఇంటికి తీసుకెళ్లి స్నానం చేయించింది. కడుపు నిండా అన్నం పెట్టింది. ఆ తర్వాత ఆ బాలుడు నిద్రపోయాడు. ఇదే సమయంలో అతని తల్లి అతడి కోసం వెతుకుతున్నారని తెలుసుకొని చెంతకు చేర్చడంతో కథ సుఖాంతమైంది. ఈ ఘటనపై సోషల్‌ మీడియాలో సదరు ఉపాధ్యాయురాలికి అభినందనలు వెల్లువెత్తాయి.

నాచగిరీశుని సన్నిధిలో నర్సారెడ్డి


నాచగిరీశుని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్‌(గజ్వేల్‌): బ్రహ్మోత్సవ వేడుకలతో అలరారుతున్న నాచారంగుట్ట నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రాన్ని ఆదివారం గజ్వేల్‌ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సందర్శించారు. గర్భగుడిలో ఉన్న స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించి తరించారు. అర్చన అనంతరం అర్చకులు హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌చైర్మన్‌ తోట ముత్యాలు, మాజీ ఎంపీపీ మోహన్‌ తదితరులు ఉన్నారు. కాగా ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు


విచారణ చేస్తున్న ఎస్‌ఐ రఘుపతి

రాయపోలు(దుబ్బాక): అటవీ ప్రాంతంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఉదంతం రాంసాగర్‌ శివారులో వెలుగుచూసింది. రాయపోలు ఎస్సై రఘుపతి కథనం ప్రకారం.. రాంసాగర్‌ శివారు.. పెద్ద గుట్ట సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలో స్థానికులైన ఎరుకలి కిష్టయ్య, ఎరుకల రాంచంద్రం, గజ్వేల్‌ మండలం ధర్మారెడ్డిపల్లికి చెందిన నుంచు పోచయ్య, వస్కుల మహంకాళి, స్వామి, గజ్వేల్‌కు చెందిన నరేందర్‌లు గుప్త నిధులు ఉన్నాయని అక్కడ తవ్వకాలు చేపట్టారు. ఈ విషయాన్ని గమనించిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. రాయపోలు ఎస్‌ఐ రఘుపతి, సిబ్బంది... నిందితులైన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చెంతనే విహారం.. నయన మనోహరం

చూసొద్దాం

మనసు దోచే ప్రదేశాలివిగో..


ఉమ్మడి మెదక్‌ జిల్లాలో చూడదగ్గ పర్యాటక ప్రదేశాలెన్నో.. ప్రఖ్యాత ఆలయాలు, చారిత్రక ప్రదేశాలు, కోటలు, సుందర ప్రకృతి దృశ్యాలకు కొదవే లేదు. చూడాలనే కోరిక, తెలుసుకోవాలనే ఉత్సాహం ఉండాలే గానీ.. మెతుకుసీమను మించిన స్వర్గధామం మరొకటి లేదు. అందులోనూ ముఖ్యంగా మెదక్‌ చర్చి, ఏడుపాయల, అభయారణ్యం, కేతకీ, వర్గల్‌ సరస్వతీ మాత, కొమురవెల్లి మల్లన్న, రంగనాయక సాగర్‌, ములుగు ఆక్సిజన్‌ పార్కు ఇలా ఎన్నో...సుందర దృశ్యాలు మనల్ని కనువిందు చేస్తాయి. ఈ ప్రదేశాలను సందర్శిస్తే ఎన్నో మధుర జ్ఞాపకాలను నిక్షిప్తం చేసుకోవచ్చు. మీ జీవితంలో మరపురాని స్మృతులుగా నిలిచి పోతాయి. పిల్లలూ ఇక ఎందుకు ఆలస్యం వేసవి సెలవుల వేళ పదండి చూసొద్దాం..

మల్లన్నసాగర్‌



దుబ్బాక : సిద్దిపేట జిల్లా తొగుట మండలంలో 50 టీఎంసీల సామర్థ్యంతో సముద్రమట్టానికి 557 మీటర్ల ఎత్తులో మల్లన్నసాగర్‌ నిర్మాణమైంది. రిజర్వాయర్‌ పూర్తిగా గోళాకారంగా 22.6 కిలోమీటర్ల చుట్టుకొలతతో అత్యంత అద్భుతంగా నిర్మించిన ఎత్తిపోతల పథకం. మల్లన్నసాగర్‌ ప్రాజెక్టు ను 17,781 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. చాలా ఎత్తయిన కట్టపై విశాలమైన రోడ్డు, పూర్తిగా ఇంజినీరింగ్‌ టెక్నాలజీతో ప్రాజెక్టు నిర్మించారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద బాహుబలి మోటార్ల ద్వారా నీరు విడుదలవుతుంది. ఇక్కడ చూడటానికి చాలా ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 10 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రపంచ ప్రఖ్యాత సీఎస్‌ఐ చర్చి



మెదక్‌జోన్‌: పట్టణంలో సీఎస్‌ఐ చర్చిలో ప్రతి వస్తువు కళాత్మకమే. ప్రతి కట్టడం ప్రత్యేకమే. ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్‌ చార్లెస్‌ వాకర్‌ పాస్నెట్‌ ఆధ్వర్యంలో 1914 నుంచి 1947 మధ్య కాలంలో చర్చి నిర్మించారు. ఆసియాలోనే అతిపెద్ద మహాదేవాలయం. దీన్ని సందర్శించిన వారెవరైనా నిర్మాణ సౌందర్యాన్ని తిలకించి పులకించి పోవాల్సిందే. ఆలయంలో కరుణామయుని చిత్రాలు అబ్బుర పరుస్తాయి. స్పెయిన్‌ గ్లాస్‌ పలకలపై క్రీస్తు జననం, శిలువ, పునరుత్థానం దృశ్యాలు కేవలం సూర్యకిరణాలతోనే తేజోవంతంగా ప్రకాశించడం వాటి ప్రత్యేకత.

వర్గల్‌ క్షేత్రం

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ శంభుని కొండపై శ్రీవిద్యా సరస్వతీ క్షేత్రం కొలువుదీరింది. రాష్ట్రంలో రెండో బాసరగా, చిన్నారుల అక్షర స్వీకారాల కేంద్రంగా ఖ్యాతిగడించింది. ఇక్కడ లక్ష్మీగణపతి, శనీశ్వర, వెంకటేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, చంద్రమౌళీశ్వర, స్వయంభూ శంభులింగేశ్వర ఆలయాలు, శంకర మఠం, వేదపాఠశాల ఉన్నాయి. కొండపైకి టవర్‌ లిఫ్ట్‌ సౌకర్యం, ఉచిత భోజన వసతి, సేదదీరేందుకు విశాలమైన భవన సముదాయాలు తదితర అన్ని మౌలిక వసతులున్నాయి. కొండ మీద ఎత్తైన వీణాపాణి విగ్రహం, భక్తులు, చిన్నారులు సేద తీరేందుకు చిల్డ్రన్‌ పార్క్‌ ఉంది.





నాచగిరి నృసింహ క్షేత్రం..

వర్గల్‌(గజ్వేల్‌): హరిద్రానది తీరాన ప్రకృతి రమణీయతలు కలబోసిన కొండ గుహల్లో స్వయంభూగా శ్రీనృసింహస్వామి వారు లక్ష్మీ సమేతులై వెలసిన భవ్య క్షేత్రం సిద్దిపేట జిల్లా వర్గల్‌ మండలం నాచారం గుట్ట నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం. రాష్ట్రంలో రెండో యాదాద్రిగా పేరొందింది. హైదరాబాద్‌కు 55 కిలోమీటర్ల దూరంలో 44వ నంబర్‌ జాతీయ రహదారి తూప్రాన్‌ నుంచి 8 కిలోమీటర్ల దూరంలో గజ్వేల్‌–తూప్రాన్‌ రోడ్డు మీద వర్గల్‌ మండలం నాచారం వద్ద నాచగిరి క్షేత్రం ఉంది. జహీరాబాద్‌, సంగారెడ్డి నుంచి గజ్వేల్‌, భువనగిరి, యాదగిరిగుట్టకు వెళ్లే బస్సులు క్షేత్రం మీదుగా వెళ్తాయి. సికింద్రాబాద్‌ నుంచి నాచారం గుట్టకు రైలు సౌకర్యం కూడా ఉంది.



ఆక్సిజన్‌ పార్క్‌

కొండపాక(గజ్వేల్‌): మండలంలోని మర్పడ్గ, రాంపల్లి శివారుల్లో 500 ఎకరాల ప్రభుత్వ స్థలంలో గత సర్కారు ఆక్సిజన్‌ పార్కు నిర్మించింది. వాచ్‌ టవర్‌, రాశీవనం, చిల్డ్రన్‌ ప్లే ఏరియా, ఓపెన్‌ ప్లస్‌ రూంలు, జిమ్‌, ఉడెన్‌ మీటింగ్‌ హాల్‌, రచ్చబండ, డైనింగ్‌ హాల్‌, చిన్న కొలను, తేజో వనం తోపాటు ప్రత్యేకంగా ట్యాంక్‌ నిర్మించారు. జీవరాసులకు నీరు దొరికేందుకు నీటి కొలను కూడా నిర్మించారు.

కొండపోచమ్మ

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ మండలం తిగుల్‌నర్సాపూర్‌ గ్రామ సమీపంలో నల్లరాతి కొండలపై కొండపోచమ్మ వెలసింది. ఆలయం ముందు ఎత్తైన గుట్టపై మధ్యలో పాత పోచమ్మ ఉంది. వచ్చిన ప్రతి భక్తుడు గుట్టపైకి ఎక్కి పాత పోచమ్మను చూసి మొక్కుతారు. ఆలయం ముందు కోనేరు ఉంది. హైదరాబాద్‌ సిద్దిపేట రహదారి కొడకండ్ల నుంచి 16 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అలాగే కొమురవెల్లి నుంచి 12 కిలో మీటర్లు దూరం ఉంటుంది.





దక్షిణకాశీగా.. కేతకీ ఆలయం

ఝరాసంగం(జహీరాబాద్‌): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందింది కేతకీ సంగమేశ్వర ఆలయం. ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఆలయ ఆవరణలో అమృతగుండం ఉంటుంది. పార్వతీ పరమేశ్వరులను మొగలి పూవులతో పూజించడం ఇక్కడి ప్రత్యేకత. హైదరాబాద్‌ నుంచి కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ముంబయి జాతీయ రహదారి మీదుగా జహీరాబాద్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఝరాసంగం కేతకి క్షేత్రం చేరుకోవచ్చు.



పోచారం అభయారణ్యం

మెదక్‌జోన్‌: మెదక్‌ జిల్లా హవేళి ఘనాపూర్‌ మండలం పోచారం అభయారణ్యంలో ఎన్నో రకాల జంతువులున్నాయి. చుక్కల జింకలు, నెమళ్లు, మనుబోతులు, నీల్గాయిలు ఇలా అనేకరకాల జంతువులున్నాయి. ఇది హైదరాబాద్‌కు సరిగ్గా 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్‌ నుంచి తూప్రాన్‌ మీదుగా వయా చేగుంట నుంచి రావచ్చు.

కోరమీసాల కొమురవెల్లి మల్లన్న..

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది. ఆలయంలో ప్రధాన దైవం మల్లికార్జున స్వామి. ఆలయంలో చూడదగిన ప్రదేశాలు, గంగిరేణు చెట్టు, రాతిగీరలు, కోడెల స్థంభం, గుట్టపైన రేణుక ఎల్లమ్మ ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం ఉన్నాయి. స్వామి బ్రహ్మోత్సవాల్లో (సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారం నుంచి ఉగాదికి ముందు వచ్చే ఆదివారం వరకు) ప్రతి ఆది, బుధ వారాలలో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు.






కోమటి చెరువు

సిద్దిపేటజోన్‌: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్‌ బండ్‌ (కోమటి చెర్వు) వేసవి సెలవుల్లో ఆహ్లాదానికి అనువైన ప్రదేశం. కోమటి చెరువు వద్ద బోటింగ్‌, బ్యాటరీ కార్‌, స్కై సైక్లింగ్‌, నైట్‌ గార్డెన్‌, రూబీ నెక్లెస్‌, నీటిపై తేలియాడే వంతెన, డైనో సార్‌ పార్క్‌, అడ్వెంచర్స్‌ పార్క్‌, గేమ్స్‌ జోన్‌లు ఉన్నాయి. హైదరాబాద్‌ నుంచి 100 కిలోమీటర్లు. కరీంనగర్‌ నుంచి 67 కిలోమీటర్ల దూరంలో సిద్దిపేట కోమటిచెర్వు ఉంది.

ఏడుపాయల దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్‌): తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఏడుపాయల వన దుర్గా క్షేత్రం లక్షలాది భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. ఈ ప్రాంతంలో మంజీర నది ఏడుపాయలుగా చీలి ప్రవహిస్తుంది. చుట్టూ రాతి గుట్టలు మధ్యలో దట్టమైన అరణ్యం. ఆ పక్కనే జల కళతో నిండు కుండను తలపించే ఘనపురం ఆనకట్ట. ఒడ్డున పచ్చని పంట పొలాలు. యేటా మహాశివరాత్రి.. మాఘ అమావాస్య, దసరా శరన్నవ రాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుగుతాయి. దుర్గమ్మను దర్శించుకొని అడవిలో టెంట్లు వేసుకొని విందులు చేసుకుంటారు. జానపద సంస్కృతిని ఆస్వాదిస్తూ గడుపుతుంటారు.



రంగనాయక సాగర్‌ ..

చిన్నకోడూరు(సిద్దిపేట): చుట్టూ పచ్చని అందాలు. పక్షుల కిలకిలరావాలకు తోడుగా జలసవ్వడులతో చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌ శివారు రంగనాయక సాగర్‌ రిజర్వాయర్‌ ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటుంది. రిజర్వాయర్‌ మధ్యలో ద్వీపం మాదిరి నిర్మాణం, కట్టపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి పర్యాటకుల మనసు దోచేస్తున్నాయి. కట్టపై ప్రీ వెడ్డింగ్‌ షూటింగ్‌లకు వేదికగా మారింది. సిద్దిపేటకు 6 కిలోమీటర్ల దూరంలో రిజర్వాయర్‌ ఉంది. ఆటోలు, బస్సు సౌకర్యం కలదు.



కేసీఆర్‌తోనే కాళేశ్వరం సాధ్యం


మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్‌: స్వరాష్ట్ర సాధనతో పాటుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యమైందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సీతారాంపల్లి మధిర గ్రామమైన శంకర్‌నగర్‌లో పెద్దమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవానికి రాగా ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాకముందు ఎడారి అని, రాష్ట్రం వచ్చాక గోదారి అయిందన్నారు. కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం, కాళేశ్వరం నీళ్లు సాధ్యమయ్యాయన్నారు. ఆయన కష్టపడి రాష్ట్రం తెచ్చి, కాళేశ్వరం నీళ్లు ఇచ్చారన్నారు. మండుటెండల్లో సైతం చెరువుల్లో నీళ్లతో మత్తళ్లు దుంకాయన్నారు. పెద్దమ్మ దయ, దీవెనతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో రూ.12 లక్షలతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. ప్రతిష్ట కార్యక్రమంలో, ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సుడా చైర్మన్‌ రవీందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు కారు తనిఖీ

మిరుదొడ్డి(దుబ్బాక): లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని చెక్‌ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు కారును ఆదివారం అధికారులు తనిఖీ చేశారు. నిజాంపేట నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న ఆయన కారును ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ అధికారులు ఆపి తనిఖీ చేశారు. వారికి ఎమ్మెల్యే హరీశ్‌రావు పూర్తి స్థాయిలో సహకరించారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి


రవికుమార్‌ (ఫైల్‌)

వెల్దుర్తి(తూప్రాన్‌): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని దామరంచలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాలె పుష్ప, పుండరికం దంపతులు. గ్రామశివారులో రెండు పౌల్ట్రీ షెడ్లు నిర్వహిస్తున్నారు. వీరి రెండో కుమారుడు రవికుమార్‌(23) వాటిని చూసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం సమయంలో తల్లిదండ్రులు ఇక్కడి వచ్చి పక్కనే ఉన్న గదిలోకి వెళ్లి చూస్తే రవికుమార్‌(23) ఉరి వేసుకొని విగత జీవిగా కనిపించాడు. కాగా, మధ్యాహ్న సమయంలో షెడ్‌లోకి కొన్ని వస్తువులు తీసుకు రమ్మని తండ్రికి ఫోన్‌ చేసి మంచిగా మాట్లాడిన యువకుడు అకస్మాత్తుగా మృతిచెందడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అతను ఒంటరిగా గదిలోకి వెళ్లగా సాయంత్రం సుమారు 5.30 గంటల ప్రాంతంలో తల్లిదండ్రులు గది తలుపులు తెరిచి చూసేవరకు గదిలోకి ఎవరూ వెళ్లనట్లు ఫుటేజీలో గుర్తించారని సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాండవులగుట్టను పర్యాటకంగా మార్చండి

హైదరాబాద్‌ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్‌ కె.పీ.రావు


హస్తాల్‌పూర్‌లో రాక్‌ పెయిటింగ్స్‌ పరిశీలిస్తున్న ప్రొఫెసర్‌ బృందం

వెల్దుర్తి(తూప్రాన్‌): మండలంలోని హస్తాల్‌పూర్‌ పాండవుల గుట్టపై వెలిసిన రాక్‌ పెయిటింగ్స్‌ను ఆదివారం హైదరాబాద్‌ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్‌ డా.కె.పీ.రావు రీసెర్చ్‌ కాలర్‌ ప్రవీణ్‌రాజ్‌తో కలిసి సందర్శించారు. గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పరిసరాలు పరిశీలించి మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉన్న రాక్‌ పెయిటింగ్స్‌పై కొంతకాలంగా పరిశోధన చేస్తున్నారన్నారు. పాండవుల గుట్ట.. రాతిబండపై ఉన్న రాక్‌ పెయిటింగ్స్‌ మహాద్భుతంగా ఉన్నాయన్నారు. సుమారు పది మీటర్ల ఏరియాలో వందలకొద్ది పెయిటింగ్స్‌ చాలా బాగున్నాయన్నారు. సుమారు 10వేల సంవత్సరాల క్రితం మెసోలీథిక్‌ పీరియడ్‌, బృహత్‌ శిలా యుగం కాలంలోనే వేసినట్లు పరిశోధనలో తేలిందన్నారు. కోతి వంటి కొన్ని జంతువులు, ఒకరి చేయి పట్టుకొని మరొకరు మనుషులు డ్యాన్స్‌ చేస్తున్నట్లు, సూర్యుడు, చంద్రుడుతో పాటు ప్రకృతి మొత్తాన్ని బండరాతిపై చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు ఇక్కడి ఆనవాలను బట్టి తెలుస్తుందన్నారు. పాండవుటగుట్టపై ఉన్న పెయింటింగ్స్‌లో అక్కడక్కడ కొంత డ్యామేజీ అయినప్పటికీ మిగిలినవి చాలా బాగున్నాయన్నారు. గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, బండరాతిపై రాక్‌ పేయిటింగ్స్‌, ఆలయ పరిసరాలు ఆహ్లాదకర వాతావరణంలో ఉన్నందున పాండవులగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని రవాణా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రొఫెసర్‌ వెంట గ్రామస్తులు అనికె రాజు, విష్ణు ఉన్నారు.

కారు ఢీకొని ఐదుగురికి గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి కారు ఢీకొని ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన కొమురవెల్లి ఆదివారం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన కొంతమంది భక్తులు ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చి సాయంత్రం తిరిగి వెళ్లే క్రమంలో ఆటోలు లభించక పోవడంతో రాజీవ్‌ రహదారి వరకు నడుకుంటూ వెళ్తుండగా.. గౌరయపల్లి క్రాస్‌ రోడ్డు సమీపంలో వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొనడంతో సుమాంజలితోపాటు ఆమె పిల్లలు దక్షాయని, వరుణ్‌, వరుణ్యతోపాటు మరో మహిళ అనూషలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 100 డయల్‌ చేయగా కొమురవెల్లి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్‌ తలారి శివాజీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.